అధ్యాయము 38

# గుడారము యొక్క నిర్మాణము


## (భాగము 3)

36:8లో ప్రారంభమైన ప్రత్యక్ష గుడార నిర్మాణపు ఇతివృత్తాన్ని నిర్గమకాండము 38 పూర్తి చేస్తుంది.[1] గుడారము మరియు దానిలోని ఉపకరణముల యొక్క తయారీ ఇప్పటికే విశదీకరింపబడినవి. ఆవరణము మరియు దానిలోని వస్తువుల యొక్క నిర్మాణమును గూర్చి చెప్తూ ఈ అధ్యాయము ముగుస్తుంది. దహన బలిపీఠము (38:1-7), ఇత్తడి గంగాళము (38:8), మరియు ప్రత్యక్షగుడారము చుట్టు ఉన్న ఆవరణము (38:9-20) యొక్క నిర్మాణమును ఈ అధ్యాయము చిత్రీకరిస్తుంది. అధ్యాయములోని మిగతా భాగములో, ప్రత్యక్ష గుడారము నిర్మించుటకు అయిన ఖర్చును గూర్చి రచయిత సూచిస్తున్నాడు (38:21-31). "మందిర పదార్థముల మొత్తము" (38:21), అనగా ప్రజల నుండి స్వేచ్ఛాపూర్వకముగా తీసుకొనిన బంగారము (38:24) మరియు సమాజములో చేరినవారి నుండి శిస్తు రూపములో సేకరించిన బంగారముతో (38:25) కలిపి, బంగారమంతటిని రచయిత వివరిస్తున్నాడు.

### యిత్తడి బలిపీఠము (38:1-7)

**1మరియు అతడు తుమ్మకఱ్ఱతో దహనబలిపీఠమును చేసెను. దాని పొడుగు**
**అయిదు మూరలు దాని వెడల్పు అయిదు మూరలు, అది చచ్చౌకమైనది. దాని యెత్తు**
**మూడు మూరలు దాని నాలుగు మూలలను కొమ్ములను చేసెను. 2దాని కొమ్ములు**
**దానితో ఏకాండమైనవి; దానికి ఇత్తడిరేకు పొదిగించెను. 3అతడు ఆ బలిపీఠ సంబంధమైన**
**ఉపకరణములన్నిటిని, అనగా దాని బిందెలను దాని గరిటెలను దాని గిన్నెలను దాని**
**ముండ్లను దాని అగ్ని పాత్రలను చేసెను. దాని ఉపకరణములన్నిటిని ఇత్తడితో చేసెను.**
**4ఆ బలిపీఠము నిమిత్తము దాని జవక్రింద దాని నడిమివరకు లోతుగానున్న వలవంటి**
**ఇత్తడి జల్లెడను చేసెను. 5మరియు అతడు ఆ యిత్తడి జల్లెడయొక్క నాలుగు మూలలలో**
**దాని మోతకఱ్ఱలుండు నాలుగు ఉంగరములను పోతపోసెను. 6ఆ మోతకఱ్ఱలను**
**తుమ్మకఱ్ఱతో చేసి వాటికి రాగిరేకులు పొదిగించెను. 7ఆ బలిపీఠమును మోయుటకు దాని**
**ప్రక్కలనున్న ఉంగరములలో ఆ మోతకఱ్ఱలు చొనిపెను; పలకలతో బలిపీఠమును గుల్లగా**
**చేసెను.**

**వచనములు 1-7. దహనబలిపీఠము** యొక్క నిర్మాణము 27:1-8లో ఇవ్వబడిన నిర్దేశములను నేరవేర్చినది. ఈ పీఠమును చేసినవానిగా గుర్తింపబడిన, మరియు **అతడు** అను సర్వనామముతో చెప్పబడిన వ్యక్తి బెసలేలు. 37:1తో ప్రారంభమై, బెసలేలు మందసమును, సముఖపు రొట్టె బల్లను, దీపవృక్షమును, ధూప వేదికను చేసాడని వాక్యము చెప్తుంది; ఇక్కడ మాత్రమే ఆయన దహన బలిపీఠమును కూడా చేసాడు అని చెప్తుంది. ఈ వాక్యములన్నీ వాస్తవములై ఉండాలంటే, బెసలేలు అనువాడు సకలవిధమైన విషయములలో కళాకారుడై యుండి ఉంటాడు. నిర్మాణ పనిలో ఈయనకు సహకరించుటకు గాను కళానైపుణ్యం కలిగిన ఇతరులు కూడా పనిలో పెట్టుకొనబడ్డారు (35:10-19). బెసలేలు సమస్తమును **చేసాడు** అంటే ఆ నిర్మాణ పనికి ఆయన బాధ్యత వహించి కార్యనిర్వహణ చేపట్టాడు. బలిపీఠమును చేయుటకుగాను ఇవ్వబడిన నిర్దేశములకును మరియు ఆ నిర్దేశకములు నెరవేర్చబడిన విధానములో ఎటువంటి ప్రత్యేకమైన తేడాలు లేవు. (27:1-8పై గల వ్యాఖ్యలను చూడండి.)



**యిత్తడి బలిపీఠము యొక్క నకలు (తిమ్నా పార్కు, ఇశ్రాయేలు)**

## ఇత్తడి గంగాళము (38:8)

**8అతడు ప్రత్యక్షపు గుడారముయొక్క ద్వారమున సేవింపవచ్చిన సేవకురాండ్ర అద్దములతో ఇత్తడి గంగాళమును దాని ఇత్తడి పీటను చేసెను.**

**వచనము 8. గంగాళము**ను తయారు చేసిన విధానమును చెప్పడానికి కేవలం ఒక

వచనము మాత్రమే అవసరమైంది. దీని నిర్మాణమును గూర్చిన నిర్దేశములు (30:17-21), అభిషేక తైలమును గూర్చిన నిర్దేశముల మినహా, ప్రత్యక్ష గుడారము నిర్మాణము విషయములో మోషేకు ఇవ్వబడిన తుది నిర్దేశములు.

రెండు వాక్యభాగములకు మధ్యనున్న ప్రాముఖ్యమైన బేధాలు ఏవంటే 38:8లో గంగాళము **ప్రత్యక్షపు గుడారముయొక్క ద్వారమున సేవింపవచ్చిన సేవకురాండ్ర అద్దములతో** చేయబడినట్లుగా ఉంది. ఇట్టి స్త్రీలను పాతనిబంధన మరియొక్క ప్రదేశములో మాత్రమే ప్రస్తావిస్తుంది: 1 సమూయేలు 2:22లో ఏలీ యొక్క కుమారులు "ప్రత్యక్ష గుడారముయూక్క ద్వారము దగ్గరకు సేవ చేయుటకు వచ్చిన స్త్రీలతో శయనించుట" అని చదువుతాము.

ఈ స్త్రీలు ఎవరు మరియు వీరు ఎలా "సేవించేవారు" అనేది స్పష్టముగా తెలియదు. హెబ్రీ పదమును (צָבָא, *tsaba'*) చూస్తే వారు చేస్తూ ఉండిన పనిని వారు చేయుటకు సంఘటితముగా ఏర్పరచబడినవారు అని తెలుస్తుంది; లేవీ గోత్రపు యాజకుల "సేవ" క్రమములో కూడా ఇదే పదమును వాడడం గమనార్హం (సంఖ్యా. 4:23; 8:24).[2] ప్రత్యక్షగుడారపు ఆవరణములను శుభ్రపరచుటకు, పాడేవారిగా మరియు మతసంబంధమైన ఉత్సవములలో ఆడుటకు (15:20, 21 చూడండి), లేదా ద్వారపాలకురాండ్రగా నియమించబడిన ఒక స్త్రీ సమూహముగా ఈ స్త్రీలను గూర్చి వ్యాఖ్యాతలు సూచిస్తున్నారు.[3] 1 సమూయేలు 2:22లో ఉన్న సంఘటనల ఆధారంగా, కొందరు ఈ స్త్రీలను బయలు దేవత ఆరాధనలో ఆయా ఉన్నతస్థలములలో ఉపయోగించే మతసంబంధమైన వేశ్యలుగా పరిగణించారు. ఏమైనప్పటికీ, ప్రత్యక్ష గుడారమునకును మరియు దాని సేవా విషయములో ఇట్టి ఒక విషయము దైవిక ప్రణాళికా క్రమములో ఆలోచించలేనిది గనుక ఇట్టి సూచనలను మనము తిరస్కరించాలి.[4]

ప్రత్యక్ష గుడారము వద్ద సేవలను చేస్తున్న ఈ స్త్రీల యొక్క ప్రస్తావనను కొందరు కాలజ్ఞానదోషముగా భావిస్తున్నారు. ప్రత్యక్ష గుడారమును ప్రతిష్ఠించుటకు మునుపే ఆ గుడారము వద్ద వీరు సేవలను అందించినట్లుగా చెప్పబడినది గనుక ఇది అచారిత్రికమైనది అనేది వారి వాదన.[5] చాలా సమస్యాత్మకంగా అనిపించే ఈ సమస్యకు సాధ్యమైన పరిష్కారం ఏమంటే తమ అద్దములను బహూకరించుటకు మునుపు మోషే ద్వారా ఉపయోగించబడిన వేరు "ప్రత్యక్ష గుడారము"లో (33:7) వీరు సేవచేసి ఉంటారు. పిమ్మట, ఈ ప్రత్యక్ష గుడారము ప్రతిష్ఠించిన తరువాత, అదే హోదాలో వారు దానిలో కూడా సేవించి ఉంటారు.

నేటికాలములో గాజుతో చేయబడే "అద్దములు" ప్రాచీన కాలములో కాల్చబడిన లోహముతో చేయబడేవి, గనుక అవి మరింత విలువగలిగి ఉండేవి. ఇట్టి అద్దములను గూర్చి Frederick W. Danker ఈ విధమైన వివరణ ఇచ్చాడు: "కొన్ని కేవలం వృత్తాకారమైన ఉపరితలాన్ని కలిగి ఉండేవి; మరికొన్నిటికి చేతి పిడులు ఉండేవి, తరచు ఇవి స్త్రీ రూపములో చేయబడి ఉండేవి; మరి కొన్నింటికి కాడలు ఉండి ఉపకరణములపై పెట్టుకొనుటకు వీలుగా ఉండేవి."[6] సేవకురాండ్రైన స్త్రీలు ఈ అద్దములను బహూకరించడం అంటే గమనార్హమైన త్యాగాన్ని చేసినట్లే. బహుశా ఈ కారణము వలననే వారిచ్చిన ఈ

బహూకరణను ప్రత్యేకముగా ఇక్కడ ప్రస్తావించి ఉంటారు.



యిత్తడి గంగాళము యొక్క నకలు (తిమ్నా పార్కు, ఇశ్రాయేలు)

## ఆవరణము (38:9-20)

[9]మరియు అతడు ఆవరణము చేసెను. కుడివైపున, అనగా దక్షిణ దిక్కున నూరు
మూరల పొడుగు గలవియు పేనిన సన్న నారవియునైన తెరలుండెను. [10]వాటి
స్తంభములు ఇరువది వాటి ఇత్తడి దిమ్మలు ఇరువది. ఆ స్తంభముల వంకులును వాటి
పెండె బద్దలును వెండివి. [11]ఉత్తర దిక్కుననున్న తెరలు నూరు మూరలవి; వాటి
స్తంభముల వంకులును వాటి పెండె బద్దలును వెండివి. [12]పడమటి దిక్కున తెరలు ఏబది
మూరలవి; వాటి స్తంభములు పది, వాటి దిమ్మలు పది, ఆ స్తంభముల వంకులును వాటి
పెండె బద్దలును వెండివి. [13]తూర్పువైపున, అనగా ఉదయపు దిక్కున ఏబది మూరలు;
[14]ద్వారముయొక్క ఒక ప్రక్కను తెరలు పదునైదు మూరలవి; వాటి స్తంభములు మూడు
వాటి దిమ్మలు మూడు. [15]అట్లు రెండవ ప్రక్కను, అనగా ఇరుప్రక్కలను ఆవరణ
ద్వారమునకు పదునైదు మూరల తెరలు ఉండెను; వాటి స్తంభములు మూడు వాటి
దిమ్మలు మూడు. [16]ఆవరణము చుట్టునున్నదాని తెరలన్నియు పేనిన సన్ననారవి.
[17]స్తంభముల దిమ్మలు రాగివి, స్తంభముల వంకులును వాటి పెండె బద్దలును వెండివి.
వాటి బోదెలకు వెండిరేకులు పొదిగింపబడెను. ఆవరణపు స్తంభములన్నియు వెండి
బద్దలతో కూర్పబడెను. [18]ఆవరణ ద్వారపు తెర నీల ధూమ్ర రక్తవర్ణములు గలదియు

**పేనిన సన్ననారతో చేయబడినదియునైన బుటాపని. దాని పొడుగు ఇరువది మూరలు; దాని యెత్తు, అనగా వెడల్పు ఆవరణ తెరలతో సరిగా, అయిదు మూరలు. [19]వాటి స్తంభములు నాలుగు, వాటి ఇత్తడి దిమ్మలు నాలుగు. వాటి వంకులు వెండివి. [20]వాటి బోదెలలో వెండిరేకు పొదిగింపబడెను, వాటి పెండె బద్దలు వెండివి, మందిరమునకును దాని చుట్టునున్న ఆవరణమునకును చేయబడిన మేకులన్నియు ఇత్తడివి.**

**వచనములు 9-20.** ఈ వాక్యభాగము ఆవరణము యొక్క నిర్మాణమును మాట్లాడుతుంది అంటే తప్పు కావచ్చు. గుడారమునకు చుట్టు ఉన్న ప్రాంగణమును కంచెవేసినప్పుడు అది ప్రత్యక్ష గుడారమునకు ప్రాంగణముగా మారినది. నిర్గమకాండము 27:9-19లో ఆ కంచె నిర్మాణమును గూర్చి చదువుతాము, కాగా 38:9-20లో ఆ నిర్దేశములు ఎలా అమలుపరచబడినవో చదువుతాము. 38వ అధ్యాయములో దాని నిర్మాణమును గూర్చిన కథనము మునుపు ఇవ్వబడిన నిర్దేశముల కథనములతో తేడాలు కలిగి ఉన్నది కాదు. ఉన్న చిన్నపాటి తేడాలు కూడా తరువాతి వాక్యభాగము మునుపటి వాక్యభాగమునకు సరాసరి నకలు కాదు అని చెప్పుటకు మాత్రమే ఉన్నాయి. (27:9-19పై గల వ్యాఖ్యలను చూడండి.)

దహనబలిపీఠము మరియు యిత్తడి గంగాళములను ఉంచిన ప్రాంగణము యొక్క పనులు పూర్తి కాగానే, ప్రత్యక్ష గుడారపు నిర్మాణము పనులు పూర్తిగా ముగిసినట్లుగా ఉంది.

## ప్రత్యక్ష గుడారము యొక్క వ్యయము (38:21-31)

తరువాత, ప్రత్యక్ష గుడారము యొక్క వ్యయాన్ని గూర్చి వాక్యభాగము మాట్లాడుతుంది. ఈ పనిని నడిపించిన వారితో, అంటే బహూకరణలను సేకరించుటలో గానీ లేదా ప్రత్యక్ష గుడార నిర్మాణ విషయములో గానీ, మొదలుపెట్టి (38:21-23) ఆ తరువాత ఎంత ఇవ్వబడినది మరియు దానిని ఎలా వెచ్చించారు అనే విషయాలను వాక్యము ప్రస్తావిస్తుంది (38:24-31).

### నాయకులు (38:21-23)

**[21]మందిర పదార్థముల మొత్తము, అనగా సాక్ష్యపు మందిర పదార్థముల మొత్తము ఇదే. ఇట్లు వాటిని యాజకుడైన అహరోను కుమారుడగు ఈతామారు లేవీయులచేత మోషే మాటచొప్పున లెక్క పెట్టించెను. [22]యూదా గోత్రికుడైన హూరు మనుమడును ఊరు కుమారుడైన బెసలేలు యెహోవా మోషేకు ఆజ్ఞాపించినదంతయు చేసెను. [23]దాను గోత్రికుడును అహీసామాకు కుమారుడునైన అహోలీయాబు అతనికి తోడైయుండెను. ఇతడు చెక్కువాడును విచిత్రమైనపని కల్పించువాడును నీల ధూమ్ర రక్తవర్ణములతోను సన్ననారతోను బుటాపని చేయువాడునై యుండెను.**

**వచనము 21.** జామా లెక్కలు వ్రాయు గుమాస్తా యొక్క సారాంశము ఈ భాగము యొక్క ప్రధాన అంశాన్ని ప్రస్తావిస్తూ మొదలౌతుంది: అదేమంటే **సమాజములో**

**చేరినవారి** నుండి శిస్తు రూపముగా సేకరించిన **మందిరపదార్థముల మొత్తము**ను గూర్చిన లెక్కలు వ్రాయడం. దేవునిచే మునుపు ఆజ్ఞాపించబడిన జనాభా లెక్కల ఆధారంగా (30:11-16) ఈ ఆదాయము సేకరించబడినది. శిస్తు రూపేణా చెల్లించవలసిన నగదుతోబాటు, స్వేచ్ఛాపూర్వకముగా ఇశ్రాయేలీయులచే ఇవ్వబడిన పరివిధాల సామాగ్రిని కూడా ఈ నివేదిక ప్రస్తావిస్తుంది (38:24, 29). 25:1-7లో కోరబడిన స్వేచ్ఛార్పణలు 35:21-29లో మరియు 36:3-7లో సేకరించబడినవి.

**ఈతామారు లెక్క పెట్టించెను** అనే భావము ఈ లెక్కింపు ప్రక్రియ అనేది ఆయన సారధ్యంలోనే జరిగినట్లుగా తెలుపుతుంది.[7] ఈతామారు అహరోను కుమారులలో ఒకడు మరియు ఈయన యాజకునిగా కూడా పనిచేసాడు (6:23; 28:1; లేవీయ. 10:6, 12, 16). ఈతామారు అనేవాడు "వస్తుజాబితాను తీసుకొనుటకు సారధ్యం వహించేవాడు" అని John I. Durham చెప్తూ సంఖ్యాకాండము 7:1-8లో, ఈతామారు మరొక మారు గుమాస్తా బాధ్యతలను నిర్వర్తించినట్లుగా ఉన్న వాక్యమును ఆధారముగా చూపాడు.[8]

**లేవీయులచేత** అనే భావము ఇక్కడ చెందిన భావముగా అనిపించుట లేదు, ఎందుకంటే ప్రత్యక్ష గుడారము విషయములో లేవీయులు ఇంకను తమ పనులను ప్రారంభించలేదు. కాబట్టి, "38:21-31 వాక్యభాగము ఈ సందర్భమునకు చెందినది కాదు, లేదా ఈ వచనములు తరువాతి కాలములో చోటుచేసుకున్న వేరే సంఘటనలను గూర్చి మాట్లాడుతున్నాయి" అని కొందరు వ్యాఖ్యాతలు తేల్చారు.[9] కానీ, లేవీయులు అప్పటికే తమ్ముతాము వేరుపరచుకున్నారు (32:26-28) మరియు అప్పటికే ప్రభువునకు ప్రతిష్ఠించుకున్నారు (32:29). కాబట్టి, వారి యొక్క సేవ అనేది నిజాముగానే మొదలయ్యింది అని ఊహించడం సరియైనదే - అందుకే వారు ఈతామారు పర్యవేక్షణలో ప్రత్యక్ష గుడారము నిమిత్తము ఇవ్వబడిన సామాగ్రిని గూర్చిన లెక్కలు రాయుటకు నియమించబడ్డారు.

**వచనములు 22, 23.** ఈ గుడారమును నిర్మించుటలో ప్రధాన పాత్ర పోషించిన వారి పేరులు మరలా ఇక్కడ కనబడుతున్నాయి: **బెసలేలు** మరియు **అహోలీయాబు**. ప్రత్యక్ష గుడారము యొక్క నిర్మాణ విషయములో బెసలేలు నాయకత్వము వహించగా, అహోలీయాబు ఈయనకు సహాయుడుగా పనిచేసాడు (31:1-6; 35:30-35పై వ్యాఖ్యలను చూడండి).

## ఇవ్వబడిన మొత్తము (38:24-31)

**24పరిశుద్ధస్థలవిషయమైన పని అంతటిలోను పని కొరకు వ్యయపరచబడిన బంగారమంతయు, అనగా ప్రతిష్ఠింపబడిన బంగారు పరిశుద్ధస్థలపు తులము చొప్పున నూట పదహారుమణుగుల ఐదువందలముప్పది తులములు. 25సమాజములో చేరినవారి వెండి పరిశుద్ధస్థలపు తులముచొప్పున నాలుగువందల మణుగుల వెయ్యిన్ని ఐదువందల డెబ్బదియైదు తులములు. 26ఈ పన్ను ఇరువది ఏండ్లు మొదలుకొని పైప్రాయము కలిగి లెక్కలో చేరిన వారందరిలో, అనగా ఆరులక్షల మూడువేల ఐదువందల ఏబదిమందిలో తలకొకటికి అరతులము. 27ఆ నాలుగువందల వెండి**

**మణుగులతో పరిశుద్ధస్థలమునకు దిమ్మలు అడ్డతెరకు దిమ్మలును; అనగా ఒక దిమ్మకు నాలుగు మణుగుల చొప్పున నాలుగు వందల మణుగులకు నూరు దిమ్మలు పోతపోయబడెను. [28]వెయ్యిన్ని ఐదువందల డెబ్బదియైదు తులముల వెండితో అతడు స్తంభములకు వంకులను చేసి వాటి బోదెలకు పొదిగించి వాటిని పెండె బద్దలచేత కట్టెను. [29]మరియు ప్రతిష్ఠింపబడిన యిత్తడి రెండువందల ఎనుబది మణుగుల రెండువేల నాలుగువందల తులములు. [30]అతడు దానితో ప్రత్యక్షపు గుడారము ద్వారమునకు దిమ్మలను ఇత్తడి వేదికను దానికి ఇత్తడి జల్లెడను వేదిక ఉపకరణములన్నిటిని [31]చుట్టునున్న ఆవరణమునకు దిమ్మలను ఆవరణద్వారమునకు దిమ్మలను ఆలయమునకు మేకులన్నిటిని చుట్టునున్న ఆవరణమునకు మేకులన్నిటిని చేసెను.**

ఇవ్వబడిన వస్తువులను వాటి విలువ ప్రకారము, ఘనమైనవి మొదలుకొని తక్కువ ఘనత కలిగిన వాటిగా నమోదు చేసారు: బంగారము, వెండి, మరియు యిత్తడి. ప్రత్యక్ష గుడారము యొక్క ప్రాంగణమంతయు పరిశుద్ధమైనది కాగా, ఆయా ఉపకరణముల పరిశుద్ధతలో ఉన్న స్థాయి ప్రకారముగా ఈ ఉపకరణములను తయారు చేసారు: యిత్తడి (పరిశుద్ధము), వెండి (మరింత పరిశుద్ధము), మరియు బంగారము (మిక్కిలి పరిశుద్ధము).

**వచనము 24. మందిరము** యొక్క పరిశుద్ధమైన ఉపకరణములను తయారు చేయుటకు మొదటి ప్రశస్తమైన లోహము, అనగా **బంగారము**ను ఉపయోగించారు. ఈ వస్తువులను **ప్రతిష్ఠిత**మైన అర్పణగా ఈ వాక్యము పేర్కొంటుంది, అంటే, ఈ సందర్భములో, ఈ అర్పణలు "స్వేచ్ఛార్పణలతో" పోలినవిగా ఉన్నాయి. ఈ అర్పణలను గూర్చిన వివరణ 35:22లో చదువుతాము: "స్త్రీలుగాని పురుషులుగాని యెవరెవరి హృదయములు వారిని ప్రేరేపించేనో వారందరు యెహోవాకు బంగారు అర్పించిన ప్రతివాడును ముక్కరలను, పోగులను, ఉంగరములను, తావళములను, సమస్తవిధమైన బంగారు వస్తువులను తెచ్చిరి."

**వచనములు 25-28.** తరువాత, ఇశ్రాయేలు సమజములో ఇరువది యేండ్లు పైబడి సమాజములో చేరిన వారి నుండి పన్నుగా వెండిని సేకరించడం జరిగింది. ఈ ప్రశస్తమైన లోహమును **పరిశుద్ధస్థలమునకు దిమ్మలు అడ్డతెరకు దిమ్మలును,** అలాగే **స్తంభములకు వంకులును** చేసెను.

జనాభా లెక్కకును మరియు ఇయ్యబడిన వెండికిని మధ్యనున్న గణితపరమైన అనుబంధాన్ని Peter Enns అనే రచియిత అధ్యయనం చేసాడు. ఈయన ఆంగ్ల అనువాదమును అనుసరించి తన లెక్కను చేసాడు. ఆంగ్ల అనువాదము ప్రకారముగా నిర్గమకాండము 38:25వ వచనము ఈ విధంగా ఉంది, "సమాజములో చేరినవారి వెండి పరిశుద్ధస్థలపు తులముచొప్పున 100 తలాంతులు మరియు 1,775 తులములు." దీనిని అనుసరించి Peter Enns ఆసక్తికరమైన ఈ క్రింది లెక్కలను ఇచ్చాడు:

> ఎఱ్ఱ సముద్రమును దాటిన ప్రతియొక్క ఇశ్రాయేలీయుడు ఒక అరతులము/బెకా (= ½ తులము/షెకెలు) ఇచ్చాడు. నూరు తలాంతులు మరియు 1,775 తులములను కూడితే మొత్తము 301,775 తులములు (ఒక తలాంతు = 3000

తులములు, కాబట్టి 100 తలాంతులు = 300,000 తులములు [దీనికి 1,775 తులము కూడితే ఆ అంకె వస్తుంది]). ఒక బెకా అంటే ½ తులము కనుక సముద్రమును దాటిన ఇశ్రాయేలీ పురుషుల సంఖ్య (26వ వచనములోని "పురుషుల"ను అక్షరాలా తీసుకుంటే) వారిచ్చిన తులముల సంఖ్యకు రెండింతలుగ ఉంటుంది, గనుక 6,03,550 మంది.[10]

సంఖ్యాకాండము 1:46లో లెక్కించిన జనాభా లెక్క ప్రకారముగా ఇవ్వబడిన సంఖ్యకు ఈ సంఖ్య సమీపముగా ఉండడం గమనార్హం. ఇవ్వబడిన సంఖ్యకు దారితీసిన జనాభా లెక్కను గూర్చి ఇవ్వబడిన నిర్దేశములు 30:11-16లో చదువుతాము. ఈ జనాభా లెక్కను ప్రత్యక్ష గుడారమును నిర్మించుటకు మునుపు చేసారు. సంఖ్యాకాండము 1వ అధ్యాయములో ఇవ్వబడిన జనాభా లెక్కను ప్రత్యక్ష గుడారము యొక్క నిర్మాణము ముగిసిన సంవత్సరము తరువాత తీసారు. కాబట్టి, రెండు వేరు వేరు నెలలలో చాలా కాలము వ్యత్యాసముతో తీయబడిన ఈ రెండు జనాభా లెక్కలు ఒకే విధమైన సమాచారాన్ని ఇస్తున్నాయి. ఈ మొదటి జనాభా లెక్క అనేది రెండవ జనాభా లెక్క కొరకు తీయబడినది, గనుక ఈ రెండవ జనాభా లెక్క ఒక రోజులోనే తీయబడినది అని Wilbur Fields అభిప్రాయపడ్డాడు.[11.]

**వచనములు 29-31.** జాబితాలో పేర్కొనబడిన ఆఖరు ప్రశస్తమైన లోహము **యిత్తడి**, దీనిని **ప్రత్యక్షపు గుడారము ద్వారమునకు దిమ్మలను ఇత్తడి వేదికను దానికి ఇత్తడి జల్లెడను వేదిక ఉపకరణములన్నిటిని చుట్టునున్న ఆవరణమునకు దిమ్మలను ఆవరణద్వారమునకు దిమ్మలను ఆలయమునకు మేకులన్నిటిని చుట్టునున్న ఆవరణమునకు మేకులన్నిటిని** చేయుటకు ఉపయోగించారు. బంగారము విషయములో వలెనే, ఇవ్వబడిన యిత్తడి కూడా ప్రతిష్ఠ అర్పణగానే చెప్పబడింది (38:24పై వ్యాఖ్యలను చూడండి). యిత్తడి ఉపకరణములు స్వేచ్ఛార్పణలు ఇవ్వబడ్డాయి (35:24).

బంగారము, వెండి, మరియు యిత్తడి యొక్క బరువు కూడా Enns ద్వారా లెక్కించబడినది:

> ఒక తలాంతును చేయుటకు 300 తులములు అవసరము. నేటి పరిమాణములో, ఇవ్వబడిన వస్తువుల కొలత ఈ రకంగా ఉంటుంది: 2,193.25 పౌండ్ల బంగారము, 7,544.38 పౌండ్ల వెండి, 5,310 పౌండ్ల యిత్తడి. వీటన్నిటిని ఒక కొలిక్కి తెస్తే, ఐగుప్తు దేశము నుండి ఇశ్రాయేలీయులు బయటకు మోసుకొని వచ్చిన విలువైన లోహముల యొక్క బరువు 15,000 పౌండ్లు. చూడబోతే ఇది చాలా ఎక్కువగానే అనిపిస్తున్నప్పటికీ, ఒక్కొక్క వయోజన ఇశ్రాయేలీ పురుషునికి కేవలం .025 పౌండ్లు మాత్రమే - అంటే జేబులో పట్టేంత మాత్రమే వస్తుంది. కొందరు సూచించినట్లుగా, ఈ పరిమాణములు అతిశయోక్తి అని చెప్పవలసిన అవసరత లేదు.[12]

ఇశ్రాయేలీయులు ఇచ్చిన బంగారు మరియు యిత్తడి వస్తువులు తమ యొక్క దాతృత్వమును ఉద్ఘాటించగా, వెండి మాత్రము వారి విధేయతను వెల్లడిపరుస్తుంది.

# అన్వయింపు

## "దాని వెల ఏమై ఉంటుంది?" (38:21-31)

దాని వెల ఏమై ఉంటుంది? ఆస్ట్రేలియాలో అయితే "Emma Chizit?" ("దాని వెల ఎంత?") అని అడుగుతారు. ఈ ప్రశ్నను తరచుగా ఆహారమును గూర్చిన, వస్త్రములను గూర్చిన, ఇంటిలోని సామాగ్రిని గూర్చిన, మరియు ఇండ్లను గూర్చిన సందర్భములో ప్రయోగిస్తారు. క్రీస్తునకు అనుచరునిగా ఉండుటకు ఎంత వెల చెల్లించవలసి ఉంటుంది? ప్రజలు తనను వెంబడించుటకు ముందే ఆ శిష్యరికమునకు చెల్లించవలసిన వెలను గూర్చి తెలుసుకోమని వారిని ప్రోత్సహించాడు (లూకా 14:28-33). ప్రత్యక్ష గుడారము పూర్తి అయినప్పుడు, దానిని నిర్మించుటకు ఎంత వ్యయము అయ్యినదో అనే విషయాన్ని ఒకరు ధృవీకరించారు.

నిర్గమకాండము 38:21-31 వచనములు ఒక గణకుని లెక్కపుస్తకముగా కనబడుతున్నవి. ప్రత్యక్ష గుడారములోని కొన్ని భాగముల యొక్క నిర్మాణము పూర్తి అయ్యింది. ఇంకా మిగిలి ఉన్న పని అంతా యాజకుల యొక్క వస్త్రములు మరియు గుడారమును పాతి దానిలో ఉపకరణములను ఉంచడమే తరువాయి. ప్రజల యొక్క స్వేచ్ఛార్పణ రూపేణా స్వీకరించబడిన వస్తువులను మరియు అరతులము పన్ను ద్వారా సేకరించబడిన మొత్తమును లెక్క రాయడం అవసరమైనట్లుగా అనిపిస్తుంది (30:13, 14). ఎంత బంగారము వాడబడినదో, ఎంత వెండి మరియు ఎంత యిత్తడి వాడబడినదో గణకుడు నమోదు చేసాడు. వయోజనులైయుండి లెక్కలో చేర్చబడిన పురుషులందరి నుండి వెండి స్వీకరించబడినది గనుక, జనాభా లెక్కలో ఎంత మంది పురుషులు లెక్కించబడ్డారో అనే విషయము కూడా సూచించబడినది: 603,550 (38:26).

ఈ గణనము జరిగినప్పుడు, ఇది లెక్కల తనిఖీదారుని నివేదికలా అనిపించింది; ఇవ్వబడిన సమస్తము కూడా సరియగు రీతిలోనే ఉపయోగించబడినది అనే విషయాన్ని ఇది వెల్లడిపరుస్తుంది. తరువాతి కాలములో ఈ మాటలను చదివేవారికి, ప్రజల యొక్క దాతృత్వమును ఈ వాక్యభాగము తెలుపుతుంది. ప్రత్యక్ష గుడారము యొక్క విలువను మరియు దాని ప్రాముఖ్యతను కూడా ఈ వాక్యభాగము చూపుతుంది.

*దానికి మూల్యము లేదు.* నేడు ఒక క్రైస్తవునిగా ఉండాలంటే ఎంత మూల్యాన్ని చెల్లించాలి? ఒక విధముగా చూస్తే, దానికి అసలు మూల్యమే లేదు. అంటే రక్షణకు అసలు మూల్యము లేదు అని చెప్పడం లేదు. రక్షణ అనేది క్రీస్తునకు తన జీవితాన్నే మూల్యంగా కోరింది - ఆయన ఈ భూమికి రావడం, దుఃఖభరితమైన ఈ జీవితాన్ని జీవించడం, సిలువలో మరణించడం. "తన స్వరక్తమిచ్చి" సంఘమును సంపాదించాడు (అపొ. 20:28; ఎఫెసీ. 5:25 చూడండి). "అనేకులకు ప్రతిగా తన ప్రాణమును విమోచనా క్రయధనముగా" యేసు ఇచ్చాడు (మత్తయి 20:28). మనలను పాపము నుండి విడిపించుటకు దేవుని యొక్క న్యాయతీర్పు కోరిన విమోచనా క్రయధనమును ఆయన చెల్లించాడు. ఫలితముగా, మనకు రక్షణ ఉచితము (ప్రకటన 22:17); అది ఒక

కృపావరము (రోమా. 6:23). మన రక్షణ కొరకైన మూల్యాన్ని క్రీస్తు చెల్లించాడు.

*దానికి సమస్తమూ మూల్యమే.* మరొక విధముగా ఆలోచిస్తే, దానికి సమస్తాన్ని మూల్యంగా చెల్లించాలి. లూకా 14వ అధ్యాయములో యేసు శిష్యరికము యొక్క మూల్యమును గూర్చి మాట్లాడినప్పుడు, శిశ్యునిగా ఒకరు ఉండాలని అనుకుంటే తప్పకుండా మూల్యాన్ని చెల్లించాల్సి ఉంటుంది అని ఆయన సూచించాడు. ఎంత మూల్యము? ధనికుడైన యౌవనస్తుని గూర్చిన కథనము దీనికి జవాబు నిస్తుంది. "నీవు వెళ్లి నీకు కలిగినవన్నియు అమ్మి బీదలకిమ్ము, పరలోకమందు నీకు ధనము కలుగును; నీవు వచ్చి నన్ను వెంబడించు"మని యేసు అతనితో చెప్పాడు (మార్కు 10:21). యౌవనస్తుడైన ఈ ధనికుడు ప్రజలందరికి ఒక ప్రతినిధిగా ఉన్నాడు. క్రీస్తును వెంబడించాలి అని అనుకొనేవారందరు తాము శిష్యులుగా ఉండుటకు మధ్యలో వచ్చే ప్రతివిధమైన అడ్డంకిని వదులుకొనుటకు సిద్ధపడి ఉండాలి.

యేసుకు సమస్తము అర్పించడం అంటే తన ఆజ్ఞల పట్ల విధేయతతో మనలను మనము ఆయనకు సమర్పించుకోవడమే. రక్షణ అనేది ఉచితమే. అది ఒక వరము, ఆ వరమును ఒకరు అంగీకరించాలి. మనము యేసుయందు విశ్వసించినప్పుడు మరియు మన పాపములను ఒప్పుకొనుటకు ఆయనపై ఆధారపడి, ఆయన నామమును ఒప్పుకొని, పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందినప్పుడు మనము రక్షణను అంగీకరిస్తాము. ఇంతమాత్రమున మన యోగ్యత క్రీస్తు యోగ్యతకు జతకలవదు; ఆయన అందిస్తున్న ఆ రక్షణకు మనము ఎన్నటికినీ అర్హులము కాము. ఆయన ఉచితముగా అందిస్తున్న ఆ రక్షణను మనము కృతజ్ఞతతో మనకు మనము తగు రీతిగా అన్వయించుకొంటాము.

క్రైస్తవునిగా ఉండడం అనేది మన నుండి ఎక్కువ మూల్యాన్ని కోరుతుందా? మనము చేయవలసిన పనిని మనము చేస్తున్నామా, లేదా మనంతట మనము ఏ మాత్రమైన మూల్యాన్ని చెల్లించకుండా ఇతరులచే మనకు అందించబడిన వరమును మాత్రమే ఆనందిస్తున్నామా? సంఘము అనేది క్రీస్తుకు తన జీవితాన్నే మూల్యముగా కోరింది. ఈ విధముగా రక్తముచే క్రయము చేయబడిన శరీరమును మరింతగా ప్రబలపరచుటకు ఎంత మాత్రము ఇచ్చుటకు మనము సిద్ధముగా ఉన్నాము?

## మనకు ఒక ఈతామారు కావాలి! (38:21-31)

ప్రతి సంఘము మరియు ప్రతియొక్క మంచి కార్యమునకు ఈతామారు కావాలి! విరాళముగానిచ్చు ధనము లేదా వస్తువులతో కూడిన ఏ విధమైన పనిలో అయినా, ఒక ఈతామారు, ఒక మంచి గణకుడు, అవసరం. స్వీకరించబడిన ధనము దానిని ఉద్దేశానుసారముగానే ఉపయోగించబడినదే తప్ప దానిలో ఏమియు వృథా అవడం కాని లేదా అపహరించబడడం కాని జరుగలేదు అని వెల్లడిపరచు నిమిత్తము స్వీకరించబడిన ధనమునకు సరిగా లెక్క అప్పజెప్పవలసియుంది. "అంతేకాక మన ప్రభువునకు మహిమ కలుగు నిమిత్తమును మా సిద్ధమైన మనస్సు కనుపరచు నిమిత్తమును ఈ ఉపకారద్రవ్యము విషయమై పరిచారకులమైన మాతోకూడ అతడు ప్రయాణము చేయవలెనని సంఘములవారతని ఏర్పరచుకొనిరి; . . . ఏలయనగా ప్రభువు

దృష్టియందు మాత్రమే గాక మనుష్యుల దృష్టియందును యోగ్యమైన వాటిని గూర్చి శ్రద్ధగా ఆలోచించుకొనుచున్నాము" అని పౌలు వ్రాస్తున్నాడు (2 కొరింథీ. 8:18-21).

## ఖరీదైన ప్రత్యక్ష గుడారము మరియు నేటి కాలములో దీని ప్రాముఖ్యత (38:21-31)

ప్రత్యక్ష గుడారము చాలా ఖరీదైనది అనే విషయము వాస్తవమైనంత మాత్రమున నేటి కాలములో క్రైస్తవులు ఖరీదైన జీవన విధానమును అవలంబించడం లేదా విలాసవంతమైన మందిర భవనములను నిర్మించడం అనే కార్యములను సమర్థించవచ్చా? (1) ఖరీదైన జీవన విధానము విషయము ఏమిటి? పరిశుద్ధ గ్రంథము క్రైస్తవులకు కలిమిని మాత్రమే వాగ్దానము చేస్తుందని క్రైస్తవులు అర్థం చేసుకోవాలి. ఇంకా చూస్తే, కొంత మంది క్రైస్తవులు ధనికులు అయినప్పటికీ (1 తిమోతి 6:17), వారు ధనమును మాత్రము ఆపేక్షించకూడదు (1 తిమోతి 6:9, 10). ప్రతియొక్క శిష్యుడు తనను మరియు తన వస్తువులను - అవి ఘనమైనవైనా లేదా అల్పమైనవైనా - ప్రభువునకు వాటిని సమర్పించాలి.

(2) విలాసవంతమైన మందిర భవనముల విషయము ఏమిటి? మందిర భవనములను గూర్చి పరిశుద్ధ గ్రంథము మౌనమే పాటిస్తుంది. ప్రభువు యొక్క కార్యమును జరిగించుటకు గాను అనవసరముగా మహోన్నతమైన భవంతులను నిర్మించుటకు ప్రత్యక్షగుడారమును అదునుగా వాడుకోకూడదు. ఇదిలా ఉండగా, ప్రయోజనాత్మకంగా ఉండే అందమైన భవనాలు నిర్మించడంలో తప్పు అని కూడా ప్రత్యక్షగుడారము ఎక్కడా సూచించుట లేదు.

---

సూచనలు

[1]ఈ వ్యాఖ్యము 39వ అధ్యాయములో చెప్పబడిన యాజక వస్త్రముల తయారీకి మినహాయింపు. [2]John I. Durham, *Exodus*, Word Biblical Commentary, vol. 3 (Waco, Tex.: Word Books, 1987), 487. [3]ఈ స్త్రీల యొక్క పాత్రలను గూర్చిన అనేకమైన సూచనలను Durham, 487, and R. Alan Cole, *Exodus: An Introduction and Commentary*, Tyndale Old Testament Commentaries (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1973), 236. అను ఈ పుస్తకములలో చర్చించడమైనది. [4]Cole, 236. [5]ఉదాహరణకు, J. Philip Hyatt, *Exodus*, The New Century Bible Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1971), 330 అను పుస్తకములో చూడండి. [6]Frederick W. Danker, "Mirror," in *The International Standard Bible Encyclopedia*, rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1986), 3:382. ఈ వ్యాసములో ఇత్తడి ఐగుప్తు అద్దం ఉంది. [7]Peter Enns, *Exodus*, The NIV Application Commentary (Grand Rapids, Mich.: Zondervan, 2000), 548. [8]Durham, 489-90. [9]W. H. Gispen, *Exodus*, trans. Ed van der Maas, Bible Student's Commentary (Grand Rapids, Mich.: Regency Reference Library, Zondervan Publishing House, 1982), 327. [10]Enns, 549, n. 55.

[11]Wilbur Fields, *Exploring Exodus*, Bible Study Textbook Series (Joplin, Mo.: College Press, 1976), 789-90. [12]Enns, 548-49. ఇదే అభిప్రాయం కొరకు, చూడండి Walter C. Kaiser, Jr., "Exodus," in *The Expositor's Bible Commentary*, vol. 2, *Genesis-Numbers* (Grand Rapids, Mich.: Zondervan, 1990), 495.